# సరస్వతీ నమస్తుభ్యం

**పి.చంద్రశేఖర్ అజాద్**

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-
ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

**ఫోన్** మోగింది.

'హలో' అనగానే అవతలనుండి సార్ ఇంటికి రమ్మంటారా. అని వినిపించింది. ఆ గొంతు నాకు సుపరిచితమే.

ఇంకా పూర్తికాలేదు. అన్నాను మొహమాటంగా నావల్ల కావడం లేదు అని చెబితే బాగుండేది.

నేను అలా చెప్పగలనా!

మొదటి సంచికలో మీ కథ వుండి తీరాలని ఎడిగారుగారంటున్నారు. అయినా మీరు రాయాలనుకుంటే అని ఆగిపోయాడతను. రాయాలనుకోవటం ఏమిటి అది నా బతుకు తెరువు అన్నాను. అంత మాట ఎందుకు సార్ పత్రిక విడుదలతేదీ కన్‌ఫర్స్ అయింది.

కనీసం ఎల్లుండి ఉదయానికి మీరు కథ ఇవ్వాలి. ఇంక ఆర్టిస్ట్‌తో బొమ్మ వేయించాలి అంటున్నాడు. తప్పకుండా అని ఫోన్ పెట్టేసాను.

ఆఫ్ట్రాల్ చిన్నకథ నన్ను ఇంతగా బాధపెడుతుందా! నేను నేనేనా?

ఒకప్పుడు కలం చేతిలోకి తీసుకుంటే చాలు పదాల కోసం తడువుకునేవాడినా! కథయినా, నవలయినా ముందుగా ఓ ప్రణాళిక వుండేదా...ఇదీ విషయం అనుకొనేవాడినా... కళ్లు రెండు మూసుకుని మనసుని కేంద్రీకరిస్తే ఎక్కడో ఓ మెరుపు...ఓ జ్ఞాపకపు శకలం...ఓ...ఆవేశం..ఓ ఆహ్లాదం...ఇంకేవేవో భావాలు...అలా తాకివెళ్తే ఎక్కడెక్కడ నుంచో వలస వచ్చిన పక్షుల్లా పాత్రలు మెదడు మీద వాలిపోయేవి.

అప్రయత్నంగా ఆ రచనల్లో ఓ మూడ్, లోకల్ కలరింగ్, అవసరమైన టోన్ కుదిరేవి. ప్రారంభం ఓ అవస్థ అంటారు. నేను అలాంటి అవస్థకెప్పుడూ లోనవలేదు. 'మీరు కథలూ, నవలలూ చాలా తొందరగా రాస్తారంట కదా.రాయటమే తప్ప వెనక్కు తిరగి చూసుకోరంట కదా అని తోటి రచయితలు అడుగుతుండేవారు. ఇంకొందరు ఆశ్చర్యంగా చూసేవారు. మరికొందరి చూపుల్లో వ్యంగ్యం. ఖచ్చితంగా చెప్పాలంటే చులకన భావం.

రచనంటే తపస్సు అలా రాసుకుపోవటమంటే సారస్వతానికి తీవ్రమైన అన్యాయం. ఓ రచనను ఎన్నెన్ని సార్లు రాస్తే కదా దానికి సార్థకత. ఎంత మథన పడాలి. ఎన్ని నెలలు నిరీక్షించాలి ఒక వ్యాసం కోసం అని నన్ను కోప్పడినవారున్నారు.

నదులతోను, సెలయేర్లతోనూ పోల్చినవారున్నారు. నువు త్వరగా ఆలస్యంగా రాస్తావో, మూడ్ కుదిరినప్పుడు రాస్తావో మాకు తెలియదు. నీ రచనలో ఓ నడక వుంటుంది. కవిత్వం ఉంటుంది. ఎలాంటి విషయం తీసుకున్న సరళంగా చెప్ప గలుగుతున్నావు. నెలల తరబడి ఆలోచించి, మెరుగులు దిద్ది. పదును బట్టామనే కొంతమంది రచనలు మాకర్థం కావు అని అన్నవారున్నారు. అయితే నన్ను ఆలోచనల్లో పడేసిన వ్యాఖ్య ఒకటుంది.



'అబ్బాయీ! నీకు సరస్వతి పలుకుతోంది' అన్నారో పెద్దాయన. సరస్వతి అంటే చదువుల తల్లి. సరస్వతంటే అక్షరం. అక్షరమంటే ప్రపంచం. ప్రపంచం నాలో పలుకుతోందా!

నేను ప్రపంచ సాహిత్యం చదవలేదు. నాకు ఇతర భాషలు రావు. ముఖ్యంగా ఆంగ్లం. సంస్కృతం నిఘంటువులు చూస్తేనే గాని ఎన్నెన్నో తెలుగు పదాలు నాకు అర్థం కావు. అలాంటిది నాకు సరస్వతి పలకటం ఏమిటి? నా మనసులో భావాల్ని చదివి నట్లున్నారు. అదో యోగం నాయనా' అన్నారు.

రచన చేయటం ఓ యోగమా! చిన్నప్పుడు భయాలు నన్ను కుదిపేస్తున్నప్పుడు మెరుపు మెరిసినా, ఉరుము ఉరిమినా, నల్లటి మబ్బుల్నీ, రోజుల తరబడి కురిసే వర్షాల్ని చూసినా 'అర్జునా' 'ఫల్గుణా' అనుకునేవాడ్ని. రాత్రులు నిద్రపట్టకపోతే 'ఆంజనేయస్వామి' ని తలుచుకునేవాడ్ని. పెద్దయ్యాక నా భయాలు తగ్గాయి. చిన్నతనంలో నన్ను వెంటాడిన అభద్రతాభావం చోటులో ఆత్మవిశ్వాసం చోటు చేసుకుంది. నేను దేవుడ్ని నమ్మటం మానేసాను. అలాంటి నాకు యోగమా!

అసలు 'సరస్వతి' అనే పదం వింటానికే అదోలా వుండేది. 'సరస్వతి' అనే భావం మన దేశానికి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా వున్న మరో రచయితల, రచయిత్రుల సంగతేమిటి? వారందరికీ యోగం వుందా? వారందరిలోనూ సరస్వతే పలుకుతోందా!

అసలు మన రచనలు ఓ ఎత్తయితే, ఆ రచనల్ని సృష్టించిన రచయితల కవుల మీద ప్రచారంలో వున్న కథలు వింటుంటే అవి ఆ రచనల్ని మించిన రసానుభూతిని కలిగించిన సందర్భాలున్నాయి.

పక్షుల్ని వేటాడే వాల్మీకి 'రామాయణం' సృష్టించటం, తెనాలి రామలింగకవి నాలుక మీద కాళికాదేవి బీజాక్షరాలు రాయటం. హలాన్ని

రచన చేయటం ఓ యోగమా! చిన్నప్పుడు భయాలు నన్ను కుదిపేస్తున్నప్పుడు మెరుపు మెరిసినా, ఉరుము ఉరిమినా, నల్లటిమబ్బుల్నీ, రోజుల తరబడికురిసే వర్షాల్ని చూసినా 'అర్జునా' 'ఫల్గుణా' అనుకునేవాడ్ని. రాత్రులు నిద్రపట్టకపోతే 'ఆంజనేయస్వామి' ని తలుచుకునేవాడ్ని. పెద్దయ్యాక నా భయాలు తగ్గాయి. చిన్నతనంలో నన్ను వెంటాడిన అభద్రతాభావం చోటులో ఆత్మవిశ్వాసం చోటు చేసుకుంది. నేను దేవుడ్ని నమ్మటం మానేసాను. అలాంటి నాకు యోగమా!

కలాన్నిపట్టిన పోతన మహాకవి పద్యపాదాల్ని శ్రీరామచంద్రుడే వచ్చి పూరించటం లాంటి సంఘటనలన్నీ 'రచన ఓ యోగం' అని చెప్పటానికి కల్పించారా అనిపించేది.

నామీద ప్రశంసల విమర్శల ప్రభావం పడలేదా అంటే నేనూ మనిషినే కదా!

నా పద్ధతి పూర్తిగా మార్చుకోకపోయినా, కొన్ని ప్రత్యేక విషయాల మీద రాయాలనుకున్నప్పుడు కాస్త ఆలస్యం చేసేవాడిని మరికొంత పరిణతి వచ్చాక రాద్దామని. ఏది ఏమైనా జీవితం నాలుకు రకరకాల అనుభవాలు నాలో ఓ ధిక్కారస్వరాన్ని సృష్టించి, పెంచి పోషించాయి. నేను ఆ పెద్దాయనతో వాదానికి దిగలేదు గాని సరస్వతి పలకటం అనేదాన్ని ఆమోదించలేకపోయాను.

నా రచనకు వస్తువు ప్రజలు. వారి అనుభవాలు. నేను విరివిగా రాయటం వల్ల నాకో శైలి ఏర్పడిందేమో. అంతే తప్ప నా రచనలకీ 'సరస్వతి' కీ సంబంధం లేదు.

నిజానికి నా అవసరాల కోసం నేను రచనలు చేసాను. కథలకొచ్చే పారితోషికం ఎంత తక్కువయినా అప్పట్లో అది నాకు ఎక్కువే. తర్వాత కాలంలో నవలలు రాసాను. ఓ పెద్ద మొత్తం చేతికి అందినప్పుడు ఏదొక వస్తువు కొన్నాను. నా రచనలకు పేరు వచ్చినప్పుడు నా గురించి మాట్లాడు కోవాలనీ, నా రచనల మీద చర్చలు జరగాలనీ రాసాను. అందుకోసం కొత్త విషయాలు ఎన్నుకున్నాను. నేను నమ్మని వాటిని కూడా సంచలనం కలిగించటానికి రాసాను. ఆ రకంగా డబ్బుకోసం. కీర్తి కోసం రాసాను. నన్ను 'పలికించేవి' అవే.

నేను కేవలం రచయితగానే మిగల్లేదు. వేదిక లెక్కి ఉపన్యాసాలు చెప్పాను. టీవీల్లో కనిపించాను నాకు ఉత్తరాలు వాసేవారూ, ఫోన్లలో పలకరించేవారూ, అభిమానిస్తున్నామని చెప్పేవారూ పెరిగారు. నా రచనల తాలుకు వేగం జీవితం లోనూ ప్రవేశించింది. అందుకే నా గురించి నేను పరిశీలించుకునే తీరిక దొరక లేదు ఇప్పుడా స్థితి వచ్చింది. నేను నిన్నటి సౌరభ్యాన్ని కోల్పోయానా? వేగాన్నీ, స్పందిచే గుణాన్ని కోల్పోయానా! ఇంక రచనలకు స్వస్తి చెప్పి 'విశ్రాంతి' తీసుకునే సమయం వచ్చిందా? ఇంక సభలకూ ముందుమాటలకే పరిమితం కావాలా? ఈ స్తబ్దతకు కారణం ఏమిటి?

జవాబులు దొరకటం లేదు నేను అంగీకరించినా, అంగీకరించకపోయినా 'సరస్వతి' నాలో పలకటం లేదు.



నన్ను నేను శోధించుకోవాల్సిన సమయం ఇది.

ఇప్పుడే
ఆ
పెద్దాయన
గుర్తొచ్చారు!

000

అప్పట్లో ఏ సాహిత్య సభ జరిగినా ఆయన వచ్చేవారు. ఓ మూలగా కూర్చునేవారు. ఎవరేం చెప్పినా శ్రద్ధగా, ఆసాంతం వినేవారు. రకరకాల బృందాలున్న సాహిత్య ప్రపంచంలో ఎవరి తోనూ కలిసేవారు కారు. సభ తర్వాత మౌనంగా వెళ్లిపోయే వారు. ఆయన దగ్గర పెద్ద గంథ్రాలయం ఉంది. పెద్ద రచయితల్నుండి ఇప్పుడే రాస్తున్న రచయిత వరకూ అందర్నీ చదువుతారు అన్ని వాదాల్నీ వింటారు. కానీ ఆయన దృక్పథం ఏమిటో చెప్పరు. అని కొంతమంది మిత్రులు చెప్పుకునేవారు ఆ తర్వాత కలంలో ఆయన కనిపించటం మానేసారు. నగరం విడిచిపెట్టి వెళ్లిపో యారని విన్నాను. ఆయనెక్కడున్నారో తెలియదు. తెలిస్తే వెతుక్కుంటూ వెళ్తాను నా స్థితిని విశ్లేషించగలిగేది ఆయనే...

ఊరంతా కార్లో తిరుగుతున్నాను.

నేను రచయితనవటానికి ముందున్న స్థితి గుర్తొచ్చింది. ఆకాశంలో కదిలే మబ్బుల్ని చూస్తున్నప్పుడు పంట చేలమీదుగా తరలివచ్చే పాట అస్పష్టంగా మనసునీ, చెవుల్నీ తాకినప్పుడు, మా మైదానంలో విస్తరించిన మహావృక్షం చిటారు కొమ్మలకు చేరి పక్షుల్లో ధీటుగా రాగాలాపన చేస్తున్నప్పుడు రకరకాల పదాలు నాలోకి చొచ్చుకుపోయేవి. వాటిని వెలికి తీసే ప్రయత్నంలో ఏం రాయాలో ఎలా రాయాలో తెలియక, ఏదో రాసి, శ్రోతల్ని వెతుక్కుని, చదువుతూ, వారి ముఖాల్లో కనిపించే భావాల్ని పరిశీలిస్తూ ఓ అనుమానంలోకి జారిపోయేవాడ్ని.

ఆ తర్వాత--

నాలోని ఊహలు నన్ను కుదిపేసేవి తమను బహిర్గత పరచమని నా ముందు వాస్తవం, కల్పన, స్వప్నాలు వెల్లువ కాగా గజిబిజిగా వుండేవాడిని. ఆ స్థితినుండి బయటపడ్డాను. ఆలోచనలు తీవ్రత దూకుడు స్వభావం, సౌందర్యకాంక్ష, మధురానుభూతులు, వీటన్నింటి మధ్య



ధిక్కార స్వరం కలగలిసిన వైరుధ్యాల సారం నా తత్త్వం. అయితే ఏదో కొసకు నన్ను కొట్టుకు పోనీయని గురువులెందరో!

జ్ఞాపకాల పేటిక తెరిస్తే గాని నేను వారందరినీ వీక్షించలేను. 'అలాంటిది జరగటానికి ముందు ఈ స్తబ్ధత పటాపంచలు కావాలి. నేనప్పుడు రచన చేయాలి.

సిగరెట్లు బూడిదవుతున్నాయి. ఎవరితో మాట్లాడుతున్నా అది నేను కాదు. మనసంతా చైతన్య స్రవంతిలా అల్లకల్లోలం అవుతుంది. ఓ చోట నిలబడలేను. కూర్చోలేను. ఇంట్లో ఎవరి మీదో కోపం, ఆశాంతి. చివరకు పిల్లల నవ్వులు కూడా నన్ను నదిలించటం లేదు.

అయినా ఇంత బాధ ఎందుకు? ఏదొక కారణం చెప్పి రాయకపోతే ఏమవుతుంది. ఆ కొత్త ప్రతికలో నా కథ వుండదు. అంతేగా! అంతేనా!

నేను రచయితనవటానికి ముందున్న స్థితి గుర్తొచ్చింది. ఆకాశంలో కదిలే మబ్బుల్ని చూస్తున్నప్పుడు పంట చేలమీదుగా తరలివచ్చే పాట అస్పష్టంగా మనసునీ, చెవుల్నీ తాకినప్పుడు, మా మైదానంలో విస్తరించిన మహావృక్షం చిటారు కొమ్మలకు చేరి పక్షుల్లో ధీటుగా రాగాలాపన చేస్తున్నప్పుడు రకరకాల పదాలు నాలోకి చొచ్చుకుపోయేవి.

రూటినుండి రిటైర్ అవుతున్నాను అని చెప్పాల్సిరావటం లోని వేదన ఇప్పుడే అర్థమవుతోంది.

ఇంకో ఇరవైనాలుగుగంటల సమయం....అప్పటిదాకా తుది సమరం చేస్తాను. అప్పటికీ కలం కదలకపోతేనా మరణశాసనం నేనే రాసుకుంటాను.

000

నా గది నుండి ఇంటి నుండి బయటకు వచ్చాను.

ఆశ...ఆశ...

ఏదోక దృశ్యం కనిపించదా! ఎవరో ఓ వ్యక్తి కనించడా! ఆకాశం మళ్లీ నన్ను కొత్తగా ప్రేరేపించదా! సౌంద ర్యమో అశాంతో నన్ను మరలా రచనకు పురికొల్పవా... రోడ్ మీద నడుస్తున్నాను తలదించుకుని నా ముందు నుంచి ఎవరో నడిచి వెళ్లారు. తలెత్తి చూసాను అదే నడక ఆయనే అయివుండాలి. పరిగెత్తుకు వెళ్లాను 'మాస్టారూ' అన్నాను. వెనక్కి తిరిగారు. ఆయనే!

చాలా కాలం తర్వాత ఆనందంతో కూడిన కన్నీళ్లొచ్చాయి

'ఎవరు బాబూ'

'నేనండి... నన్ను గుర్తుపట్టలేదా?

నా కళ్లలోకి నిశితంగా చూస్తున్నారు. ఆయన ముఖంలో నేను ఇంతకు ముందు గమనించిన వెలుగేదో వుంది.

"నువ్వా" అన్నారాయన.

"ఎన్ని సంవత్సరాలయింది మిమ్మల్ని చూసి ఎక్కడుంటున్నారు?"

"మా ఊరు వెళ్లి పోయాను. పనిమీద వచ్చాను. ఈ రాత్రికి వెళ్లి పోవాలి." అన్నారు

"నా కోసం ఓ గంట కనీసం ఓ అరగంట కేటాయించగలరా" అన్నాను. మాట్లాడ లేదాయన


"కావాలంటే నా కారులో మీ ఊరు పంపిస్తాను. నాకు కొన్ని ప్రశ్నలకు జవాబు కావాలి."

నా ఉద్వేగం చూసి 'అలాగే' అన్నారాయన.

మళ్లీ కన్నీళ్లే!

000

"సరస్వతి పలుకటం లేదు మాస్టారూ"



అన్నాను.

చిరునవ్వుతో చూసారు.

"మీరు రచన ఓ యోగం అన్నారు జీవితం యోగం కాదా! జీవించటం యోగం కాదా" అన్నాను.

"నీ సమస్య చెప్పునాయనా."

"నేను రచనలు చేయలేకపోతున్నాను. మీ భాషలో సరస్వతి పలకటం లేదు. నా వైఫల్యానికి కారణం ఏమిటి నేను ఏమనుకుంటానో అనుకోవద్దు. సూటిగా చెప్పండి."

ఆయన తలూపి కొద్దిసేపు కళ్లు మూసుకున్నారు

"నీ కెప్పుడైనా నీ రచనను చదువుతున్నప్పుడు ఇది నేను రాసిందేనా అనిపించిందా?" అన్నారు.

"చాలా సార్లు"

"అంటే ఆ రచన చేస్తున్నప్పుడు నేను నేను కాదు. చేతిలోని కలానికీ మెదడుకో మధ్య రహస్య ప్రవాహం ఏదో ఉండేది. అలాంటి స్థితే మాస్టారూ!" అన్నాను.

"దాన్ని నేను సరస్వతి అంటాను. నువ్వు అనుభవం అనొచ్చు. ప్రేరణ అనవచ్చు, ఉన్నదాన్ని వున్నట్లే ఎవరూ రాయరు కొంత కల్పన కొన్ని ఆశలు ఏదో చెప్పాలనుకోవటం ఇవన్నీ కలగవలసి అంతర బాహ్యస్థితి అది. నేను నీ ద్వారా పాఠకులకు చేరాలి. నా అనుభవం మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు. మనుషులందరూ ఎవరో ఒకరికి తమ అనుభవాలు చెబుతారు. కొందరు వాటిని రాస్తారు. ఇంకొందరు వేరే రూపంలో వాటిని ఆవిష్కరిస్తారు. ఓ సృజన జరుగుతున్నప్పుడు ఏ మనిషీ తాను తాను కాదు అది వారికి తెలియదు. అలా తెలియక పోవటమే యోగం."

ఆయన మాటల్ని నెమరు వేసుకుంటున్నాను.

ఏదో అర్థమవుతున్నట్లుంది. అయినా అస్పష్టతే!

జీవితంలో ఏ చిన్న అంశమైనా యోగమే. బతుకే కాదు. చావూ యోగమే. బతకటం చావటం అనే వాటిని మన చేతుల్లో ఉన్నంత వరకైనా నడుపుకోవటం "యోగం"

నా శరీరంలో ఏవో ప్రకంపనలు. నాకు తెలుస్తోంది. "అబ్బాయీ! రచన చేస్తున్న తొలిరోజుల్లో నువ్వు పసివాడివి. సృష్టిలోని ప్రతిదీ నీకు వింతే. నిప్పుని తాకాలనీ. ఆకాశాన్ని అందుకోవాలనీ అనుకుంటావు. అది అసాధ్యమని తెలియక పోయినా అందులో ఓ సౌందర్యం వుంది. సాధ్యాసాధ్యలను ఆలోచించని స్థితిలో ఆచరణకు దిగుతావు రచనా అంతే. ఓ నిర్మలమైన ఆరాటం నీ నుంచి సహజ సిద్ధమైన రూపు దాల్చుతుంది. నువ్వు ఏది కోరుకుంటావో దానికి లోబడి ఆరాధించే స్థితిలో వుంటావు."

తలూపాను

"ఇప్పుడు నీమీద ఎన్నెన్నో ప్రభావాలు. రచనని నీ జీవితంగా భావించిన రోజులన్నీ నీ అస్తిత్వం లేకుండా ఓ మధురమైన అనుభూతిని పంచాయి. ఇప్పటి నీ స్థితి వేరు..."

"అంటే..."

"లక్ష్మి అంటే సంపద. అది చంచలం అంటారు. సరస్వతి అంటే అక్షరం. అది చంచలమే యోగమూ. చంచలమే నిన్ను నువ్వు ఈ ప్రపంచానికి అతీతంగా భావించనంత కాలం సరస్వతి నాలో కొలువుంది. నీ కీర్తి ప్రతిష్ఠలూ నీకు ఆపాదించిన నువ్వు ఆపాదించుకున్న 'వ్యక్తిత్వం' నీ కంటే ఎత్తుకెదిగాయి. నువ్వు చేసే ఉద్యోగం వృత్తి, నీలో ఇతరుల కుండే అవసరాలు, నీ దగ్గర పోగుపడ్డ సంపద నిన్ను నీకు మించినవాడ్ని చేసాయి. ఒకప్పుడు నువ్వు సరస్వతికి అంటే నీ భాషలో రచనకి సరెండర్ అయ్యావు ఎప్పుడయితే నీ రచనకంటే నువ్వే గొప్పవాడిననే జ్ఞానం నీకు కలిగిందో అప్పటి నుండి సరస్వతి నీ నుండి వెళ్లిపోయింది."

నేను సిగ్గుపడుతూ "అది జ్ఞానమా!" అన్నాను

ఆయన చిరునవ్వు నవ్వారు. మాట్లాడలేదు.

నాలో ఓ మహా విస్ఫోటం.

"నేను ఈ శతాబ్దాన్ని నడిపిస్తున్నాను అన్నా, వ్యసనం మనం ఎన్నుకున్న రంగాన్ని కబళించినా, అలంకరింకంగా చెప్పే మాటల్ని నిజమని భ్రమపడినా ఆ తల్లి అంతర్థానమవుతుంది."

చాలాసేపు నిశ్శబ్దం.

ఆయన మాటల్ని జీర్ణం చేసుకోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాను. "ఇంక నేను అస్త్ర సన్యాసం చేయటమే మార్గమా మాస్టారూ" అన్నాను బాధగానే.

"అది నిర్ణయించుకోవాల్సింది నువ్వు. నేనీ ప్రపంచానికి శాశ్వతంగా నిలిచిపోయే సృజనను ఇచ్చాననే భ్రమలో వుంటే సరస్వతి నీ దగ్గరకు రానవసరం లేదు. అలా కా దనుకున్నప్పుడు నువ్వెవరో మరిచిపోవటం, సరస్వతికి సరెండర్ కావటమే మార్గం. ఆ మాత్రం అజ్ఞానంలోకి జారిపోవటమా లేదా అనేది నీ మీద ఆధాపడివుంది.

●

దాన్ని నేను సరస్వతి అంటాను. నువ్వు అనుభవం అనొచ్చు. ప్రేరణ అనవచ్చు, ఉన్నదాన్ని వున్నట్లే ఎవరూ రాయరు కొంత కల్పన కొన్ని ఆశలు ఏదో చెప్పాలనుకోవటం ఇవన్నీ కలగవలసి అంతర బాహ్యస్థితి అది. నేను నీ ద్వారా పాఠకులకు చేరాలి.